విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com కర్నూలు, శనివారం 1, నవంబరు 2025

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

విశాలాంధ్ర-గుంతకల్లు: పట్టణంలో ఏఐటియుసి 106వ. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని మున్సిపల్ ఆఫీస్‌లో ఏఐటీయూసీ జెండాల ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం జరిగింది. మున్సిపల్ ఎంప్లాయిస్ కార్మికులు, మిల్లు హమాలి, పాత గుంతకల్ హమాలి ఆధ్వర్యంలో ఏఐటీయూసీ జెండాను మండల నాయకులు ఈశ్వరయ్య, సురేష్ ఆవిష్కరించారు. ఎఐటియుసి 106వ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు, మున్సిపల్ ఎంప్లాయిస్ కార్మికులు నాయకులు నరసయ్య, హనుమంతు, మిల్లు హమాలి నాయకులు మల్లికార్జున, శీన, దేవేంద్ర, హనుమంతు, చెన్నయ్య, పాత గుంతకల్ హమాలి యూనియన్ నాయకులు మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం..

విశాలాంధ్ర-తాడిపత్రి: విద్యుత్ సరఫరాకు శనివారం అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ వీరాంజనేయులు ప్రజలకు తెలియజేశారు. శుక్రవారం ఒక ప్రకటనలో ఏఈ వీరాంజనేయులు మాట్లాడుతూ తెరన్నపల్లి 220కేవీ సబ్ స్టేషన్లో క్రొత్తగా బ్రేకర్ ఏర్పాటు చేస్తున్నారు. అందులో భాగంగా రేపు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు తాడిపత్రి టౌన్, రూరల్, యాడికి మండలంలోని గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుంది... కావున విద్యుత్ వినియోగదారులు, ప్రజలు సహకరించాలని కోరారు.

25 ఏళ్లపాటు తాగునీటి సమస్య లేకుండా చేస్తాం

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్

సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మంత్రి

విశాలాంధ్ర-ఉరవకొండ: ఇంటింటికి మంత్రి" కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు శుక్రవారం ఉరవకొండ పట్టణంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకున్నారు. పట్టణంలోని అంబేద్కర్ నగర్, ఇందిరా నగర్, తదితర కాలనీలలో పర్యటించి నేరుగా ప్రజల ఇంటి వద్దకే వెళ్లి మహిళలు, ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకుని వాటిని వెంటనే పరిష్కరించాలని అక్కడికక్కడే అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ ఉరవకొండ పట్టణంలో మరో 25 ఏళ్లు తాగునీటి సమస్య లేకుండా చేస్తామని, ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. పట్టణంలో 30 ఏళ్ల కిందటి పైప్ లైన్ లు ఉన్నాయని, వాటిని మారుస్తామన్నారు. అవసరమైన డ్రైనేజీలు ఏర్పాటు చేస్తామన్నారు. వర్షం వల్ల మగ్గం గుంతల్లో నీళ్లు వచ్చి ఉపాధి కోల్పోయామని పలువురు చేనేతలు తెలుపగా, వెంటనే ఫోన్ ద్వారా చేనేత జౌళి శాఖ ఏడీతో మంత్రి మాట్లాడుతూ నష్టం నివేదికలను కలెక్టర్‌కు పంపించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి అర్జీలు తీసుకున్నారు. ఉరవకొండ పట్టణంలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేసేందుకు ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలనేది ప్రజలతో సలహాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

కోకో పోటీల్లో సత్తా చాటిన చిన్నహోతూరు విద్యార్థులు

విశాలాంధ్ర-ఉరవకొండ: స్థానిక ఎస్ కే ప్రభుత్వ హై స్కూల్ క్రీడా మైదానంలో శుక్రవారం జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ గుంతకల్లు డివిజనల్ స్థాయి ఖోఖో పోటీల్లో వజ్రకరూరు మండలం చిన్నహొతూరు ప్రభుత్వ హైస్కూల్‌కి చెందిన విద్యార్థులు ప్రతిభ చూపి అండర్-14 బాలురు బాలికలు, అండర్-17 బాలికలు, బాలురు విభాగంలో ఘన విజయం సాధించారు. అండర్ 14 బాలురు మరియు బాలికలు విన్నర్స్ గా, అండర్ 17 బాలురు బాలికలు రన్నర్స్‌గా నిలిచారు. వీరిలో నవంబర్ 6 న జరిగే జిల్లా స్థాయి పోటీల్లో చిన్న హొతూర్‌కు చెందిన క్రీడాకారులు 18 మంది ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం శ్రీనివాసరెడ్డి తెలిపారు. పీడీ ప్రభాకర్ సిబ్బంది పాల్గొన్నారు.

బాలుర అండర్-14కు ఎంపిక

విశాలాంధ్ర-తాడిపత్రి: బాలుర అండర్-14 అనంతపురం జిల్లా క్రికెట్ జట్టుకు తాడిపత్రి క్రీడాకారుడు బురానుద్దీన్ ఎంపికయ్యాడని క్రికెట్ కోచ్ భార్గవ్ చెప్పారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో కోచ్ భార్గవ్ మాట్లాడుతూ తాడిపత్రి ఆర్డిటి సబ్ సెంటర్ కు చెందిన బురానుద్దీన్ అండర్-14 జిల్లా జట్టుకు ఎంపికై, అనంతపురంలో జరిగిన అండర్-14 ప్రాబబ్స్‌లో మంచి ప్రతిభ కనబరిచి అత్యధిక పరుగులు సాధించాడన్నారు. కడపలో జరిగే ఆంధ్ర క్రికెట్ సంఘం రాయలసీమ జిల్లాల టోర్నమెంట్లో 1 నుండి 11 వరకు పాల్గొంటున్నాడు. జిల్లా జట్టుకు ఎంపికైనందుకు తాడిపత్రి మండల క్రికెట్ అసోసియేషన్ సెక్రెటరీ సాదిక్ వలి హర్షం వ్యక్తం చేశారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్.. యువతకు స్ఫూర్తి

విశాలాంధ్ర-జేఎన్టియుఏ: దేశంలోనే సంస్థానాలన్నీ విలీనం చేసే.. జాతీయ ఐక్యతను చాటి.. ఉక్కు మనిషిగా నిలిచారని వీసీ ఆచార్య హెచ్ సుదర్శన్ రావు, రిజిస్ట్రార్ ఎస్. కృష్ణయ్య పేర్కొన్నారు. శుక్రవారం పరిపాలన భవనంలో సర్దార్ వల్లబాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో ఓఎస్డి వీసీ ఆచార్య ఎన్. దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు ఆచార్య పి.ఆర్. భానుమూర్తి ఆచార్య ఎస్.వి.సత్యనారాయణ, బి.దుర్గా ప్రసాద్, జి.వి. సుబ్బా రెడ్డి, నాగప్రసాద్, బి.ఈశ్వర్ రెడ్డి, వైశాలి ఘోర్పడే , జి.ప్రశాంతి, సి.శోభా బిందు, కిరణ్మయి, సుజాత, ఆచార్య దేవకుమార్, ఎ.పి. శివ కుమార్, డాక్టర్ బి.ఓం ప్రకాష్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.వసుంధర, ఫైనాన్స్ ఆఫీసర్ వెంకట శివారెడ్డి, డీఆర్‌లు, ఏఆర్‌లు, భోధన, భోధనేతర సిబ్బంది అవుట్ సోర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రీయ ఏకతా దివస్ ర్యాలీ

విశాలాంధ్ర-కణేకల్లు : రాయదుర్గం రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పర్యవేక్షణలో కనేకల్ పోలీస్‌స్టేషన్ ప్రొబేషనరీ సబ్-ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ వి.నారాయణరెడ్డి, ఏఎస్ఐ శంకర్‌రెడ్డి, హెచ్‌సి చంద్రమోహన్ సిబ్బంది రాష్ట్రీయ ఏకతా దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కనేకల్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. పోలీస్‌స్టేషన్ వద్ద ఏక్ దివాస్ ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించారు, అనంతరం కనేకల్ ప్రధాన వీధులలో ర్యాలీలో విద్యార్థులు ఉపాధ్యాయులు, పోలీసులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సబ్-ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ సర్దార్ వల్లభభాయ్ పటేల్ సేవలను స్మరించుకోవడం, దేశ ఐక్యత, సమగ్రత, భద్రత కాపాడే దిశగా ప్రతి పౌరుడు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జాతీయ సమైక్యతా దినోత్సవ ర్యాలీ

గుత్తి పట్టణంలో ర్యాలీ చేస్తున్న దృశ్యం

విశాలాంధ్ర-గుత్తి : స్థానిక కేంద్రీయ విద్యాలయ విద్యార్థులు ఉపాధ్యాయులు శుక్రవారం ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ప్రిన్సిపల్ మల్కిసాబ్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యతా దినోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. కేంద్రీయ విద్యాలయం నుండి పట్టణంలోని ఎన్టీఆర్ కూడలి వరకు భారతమాతకు జై అంటూ విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. దేశ సమైక్యతకు పాటుపడిన మహోన్నత వ్యక్తి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని కొనియాడారు. ప్రతిఒక్కరూ వారి బాటలో నడవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు, ఉపాధ్యాయులు కేంద్రీయ విద్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పామిడిలో నివాళులు అర్పిస్తున్న దృశ్యం

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ మండలం నేరమెట్ల గ్రామానికి చెందిన మంజునాథరెడ్డి (42) అనే రైతు అప్పులబాధ తాళలేక శుక్రవారం ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. వ్యవసాయంలో వరసగా నష్టాలు రావడం... అప్పులు తీర్చే మార్గం లేక పోవడంవతో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఉరవకొండ పోలీసులు తెలిపారు.

దాసరి సునీత తన ఎంపీపీ పదవికి రాజీనామా చేయాలి..

విశాలాంధ్ర-శింగనమల : బుక్కరాయసముద్రం మండలం ఎంపీపీ దాసరి సునీత వైసీపీ జెండా చాటున గెలిచి టీడీపీలో చేరి మీడియాలో మాట్లాడిన మాటలపై వైసిపి నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షులు ఆంజనేయులు ఘాటుగా స్పందించారు. శుక్రవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ సునీత తన ఎంపిపి పదవికి రాజీనామా చేసి ప్రజాక్షేత్రంలోకి రావాలని సవాల్ విసిరారు. కూటమిలో ఏ పార్టీ జెండా చాటున వస్తారో రండని గెలిచి నిరూపించుకోవాలన్నారు. డబ్బు ఆశ చూపి మా వైసీపీ ఎంపీటీసీ శిరీషను పెట్టుకొని మళ్ళీ ఎంపిపిగా కొనసాగుతున్నావని, అదే వైసీపీ లేకపోతే నీకు ఎంపిపి పదవి వచ్చేదా అని ప్రశ్నించారు. తెరచాటున ఉండి నాటకాలాడించేవారికి వచ్చే ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు.

గృహ నిర్మాణానికి దరఖాస్తు చేసుకోండి

విశాలాంధ్ర-పామిడి : ప్రధానమంత్రి ఆవాస్ యోజన (గ్రామీణ) 2.0 పథకం కింద కొత్తగా ఇళ్లు నిర్మించుకోవాలనుకునే అర్హులైన కుటుంబాలు దరఖాస్తులు చేసుకోవాలని మండల గృహనిర్మాణ శాఖ ఏఈ మారుతి ఒక ప్రకటన ద్వారా శుక్రవారం తెలిపారు. స్వంత స్థలం కలిగి, ఇప్పటివరకు ఎప్పుడూ ప్రభుత్వ పథకం కింద ఇళ్లు మంజూరు కాని అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతోపాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, బ్యాంకు ఖాతా పుస్తకం, కులం ఆదాయ ధ్రువపత్రాలు, ఆన్లైన్ భూమిపట్టా, ఉపాధి హామీ జాబ్ కార్డు ప్రతులు జతపరచి గ్రామ లేదా వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అవకాశాన్ని వినియోగించుకొని స్వగృహ కల నెరవేర్చుకోవాలని పిలుపునిచ్చారు.

ఎన్‌సీసీ క్యాడెట్ల సెలక్షన్స్..

విశాలాంధ్ర-గుంతకల్లు : స్థానిక ఎస్.కే.పి ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఎన్సిసి సెలక్షన్స్ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో జరుగుతాయని ఎస్కేపి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. ఏ.లక్ష్మయ్య, ఎన్‌సీసీ అధికారి లెఫ్టెంట్ బాలకృష్ణ, సుబేదార్ కైలాస్ బంకర్ సుబేదార్ రాజేష్‌సింగ్ అనంతపురం ఆంధ్ర బెటాలియన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందని అన్నారు. సెలక్షన్స్‌లో భాగంగా విద్యార్థులకు రన్నింగ్ రేస్,పుష్ అప్స్, పుల్లప్స్ పోటీలు నిర్వహించి సీనియర్ డివిజన్ విభాగంలో 13 క్యాడట్స్‌ను, సీనియర్ వింగ్‌లో 9 క్యాడట్స్ ను సెలెక్ట్ చేశామన్నారు. సెలెక్ట్ అయిన విద్యార్థులు ఎన్‌సీసీలో మూడు సంవత్సరాలు ట్రైనింగ్ తీసుకొని బి సర్టిఫికెట్ ఎగ్జామ్ సి సర్టిఫికెట్ ఎగ్జామ్ రాసే అర్హత పొందుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఏ.లక్ష్మయ్య, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ బాలకృష్ణ, సుబేదార్ కైలాష్ బంకర్, సుబేదార్ రాజేష్‌సింగ్ పాల్గొన్నారు.

విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

విశాలాంధ్ర-తాడిపత్రి: విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఏఎస్పి రోహిత్ కుమార్ చౌదరి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గన్నెవారిపల్లి పంచాయతీ, ఆటోనగర్ సమీపంలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలో రూరల్ సీఐ శివ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు రోడ్డు, ఆడపిల్లల భద్రతపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథి ఏఎస్పి రోహిత్‌కుమార్ చౌదరి మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టంతో కష్టపడి చదివి, తమ తల్లిదండ్రుల కలలను సాకారం చేస్తూ, ఉన్నత శిఖరాలకు ఎదగాలని చెప్పారు. చదువు అనంతరం పట్టుదలతో ఉండి పోటీ పరీక్షలలో రాణించి ఉద్యోగాలు సంపాదించడానికి కృషిచేసి, తమ జీవితానికి భద్రత కల్పించుకోవాలన్నారు. అలాగే ఆడపిల్లలు ఎంతో జాగ్రత్తతో మసులుకుంటూ ఏదైనా సమస్యలు ఏర్పడినప్పుడు తమకు తాము రక్షణ కల్పించుకోవడానికి ధైర్యంగా ఉండాలన్నారు. అంతేకాకుండా రోడ్డు భద్రత విషయంలో ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమ, నిబంధనలు పాటిస్తూ వాహనాలు నడపాలని అన్నారు. వాహనం నడిపే ప్రతి ఒక్కరు లైసెన్సు, ఇన్సూరెన్స్ తప్పక కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. విద్యార్థులు రోడ్డు భద్రతపై తమకు తెలిసిన ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించాలని తెలియజెప్పారు. ఈ కార్యక్రమంలో పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన సేవలు మరువలేనివి..

విశాలాంధ్ర-ఉరవకొండ: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ డి. ఆదినారాయణ అధ్యక్షతన ఎన్.ఎస్.ఎస్ ఉరవకొండ పట్టణ లయన్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి లయన్స్ క్లబ్ అధ్యక్షులు బి.లక్ష్మీనారాయణ విద్యార్థులను ఉద్దేశించి ఉపన్యశిస్తూ భారత స్వాతంత్ర సమరయోధుడు, నవభారత నిర్మాత, సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి చేసిన సేవ మరువలేనిదని, స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మాగాంధీజీతో పాటు అనేక ఉద్యమాలలో పాల్గొని ప్రజలు రైతుల పక్షాన ఉంటూ ఎన్నో విజయాలు పొందారని అలాగే స్వాతంత్ర్యానంతరం దాదాపుగా 562కు పైగా సంస్థానాలను భారతదేశంలో విలీనం చేయడంలో కీలకపాత్ర పోషించి ఉక్కుమనిషిగా పేరు సంపాదించారని తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన వకృత్వ పోటీలు నిర్వహించి విజేతలకు ముఖ్య అతిథుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు. ఆ తర్వాత ప్రిన్సిపల్.. అధ్యాపకులు, విద్యార్థులు చేత జాతీయ ఐక్యత దినోత్సవం ప్రతిజ్ఞ చేయించారు. ముఖ్య అతిథులకు ప్రిన్సిపల్ అధ్యాపకులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ టీ.ఎన్. మస్తానప్ప, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్. బి.వెంకట రాముడు, ఎం.పరమేష్ ,లైన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ పి.గణేష్‌బాబు, ఎం.సీ నాగభూషణం, డిప్యూటీ ఇంజనీర్ ఎం. వెంకటేశులు, జీ.కే శ్రీధర్, అల్తాఫ్, డాక్టర్ .జె .కృష్ణవేణి, డాక్టర్ .పి.రమేష్ బాబు, కే.సుజాత, నీలి వెంకటేశులు, ఎం. సుధాకర్, సీతారామ గుప్తా, రామాంజనేయులు, నాగేంద్ర పాల్గొన్నారు.

ఉరవకొండ నియోజకవర్గంలో అక్రమ మైనింగ్‌ను ఆపాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన విశ్వేశ్వర రెడ్డి

కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ..

విశాలాంధ్ర-ఉరవకొండ: ఉరవకొండ నియోజకవర్గంలోని పిఏబిఆర్ డ్యామ్ కు సమీపంలో ఉన్న నల్లగట్టు అక్రమ మైనింగ్ ను వెంటనే ఆపాలని, మైనింగ్ కు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, కలెక్టర్‌ను ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వైవిశ్వేశ్వర రెడ్డి కోరారు. శుక్రవారం కలెక్టర్‌ను కలిసి అక్రమ మైనింగ్‌పై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నల్లగుట్ట మైనింగ్ డ్యామ్ రక్షణకు ప్రమాదకరంగా తయారైందని దాదాపు కోట్ల రూపాయలు విలువ చేసే గ్రానైట్ ని ఇప్పటికే తరలించారని తెలిపారు.అధికార తెలుగుదేశం పార్టీ అండతోనే ఈ అక్రమాలు జరుగుతున్నాయన్నారు.

తహశీల్దారు మా అనుమతులు లేవు ఇది అక్రమం అని చెప్పినప్పటికీ అధికార అహంతో అక్రమ మైనింగ్ చేస్తున్నారని తెలిపారు. ఆర్థిక శాఖ మంత్రి మంత్రి పయ్యావుల కేశవ్ గ్రామానికి 5 కిలోమీటర్ల దూరంలో ఈ అక్రమం యథేచ్ఛగా జరుగుతున్నదని. నల్లగుట్ట అక్రమ మైనింగ్ వల్ల డ్యామ్ కు ప్రమాదం అని ఈ డ్యామ్ దెబ్బ తింటే చుట్టు ప్రక్కల గ్రామాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని తెలిపారు. అక్రమ మైనింగ్ జరుగుతున్న, రెవిన్యూ ,పోలీసు మరియు మైనింగ్ శాఖ అధికారులు స్పందించడం లేదన్నారు. బ్రాహ్మణపల్లి సర్వే నంబర్ 93కు చెందిన 136 ఎకరాల భూమి ఎవరికీ చెందుతుందో నిర్ధారించాలని కోరారు. ఇది ఇరిగేషన్ చెరువుగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారని ఈ ఇరిగేషన్ చెరువుని కాజేయడానికి అన్యాక్రాంతం చేయడానికి కొంతమంది రాజకీయనాయకులు ప్రయత్నం చేస్తున్నారు అని తెలిపారు.

గొర్రెల సంత ప్రారంభం..

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం : కళ్యాణదుర్గం మార్కెట్ యార్డులో గొర్రెలు, మేకలు, పశువుల సంతను పునఃప్రారంభించారు. కళ్యాణదుర్గం మార్కెట్ యార్డు చైర్మన్ లక్ష్మీదేవి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ వైపీ రమేష్, వైస్ చైర్మన్ కోనంకి రాజశేఖర్, మున్సిపల్ కమిషనర్ వంశీ కృష్ణ భార్గవ్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాసులు, మార్కెట్ యార్డు డైరెక్టర్లు వైబీ ఓబయ్య, కుబేర్ యాదవ్, పాలబండ్ల హనుమంతరెడ్డి, బాగేపల్లి రాజా, ముత్యాలమ్మ సురేంద్ర, మంజులా వన్నూరుస్వామీ, బాల్యం రాజేష్ సంతను అట్టహాసంగా ప్రారంభించారు.. ఈ సందర్భంగా మార్కెట్ యార్డు చైర్మన్ గోళ్ళ లక్ష్మీదేవి మాట్లాడుతూ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు.. పశుపోశకుల ఇబ్బం దులను మంత్రి, ఇతర అధికారుల దృష్టికి తీసుకెళ్లి సంతను ప్రారంభించారని చెప్పారు. ఇక్కడ ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

తూట్రాళ్లపల్లి పాఠశాల మాజీ విద్యా కమిటీ చైర్మన్ మృతి

విశాలాంధ్ర-యాడికి: మండలంలోని తూట్రాళ్లపల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు ఎం.పి.యూ.పి. స్కూల్ మాజీ విద్యా కమిటీ చైర్మన్ చాకలి రంగా తల్లి చాకలి ఈశ్వరమ్మ ఛాతి నొప్పితో మృతిచెందిన విషయం తెలిసి శుక్రవారం గ్రామ సర్పంచ్ వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎం.సంజీవరాయుడు ఇంటికి వెళ్లి చాకలి ఈశ్వరమ్మ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సంజీవరాయుడు రంగా కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి, ఈశ్వరమ్మ మరణం పట్ల ఆయన తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ కుటుంబానికి తన సానుభూతిని తెలిపారు.

దళిత కాలనీలో సివిల్ రైట్స్ డే కార్యక్రమం

విశాలాంధ్ర-కూడేరు : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో శనివారం సివిల్ రైట్స్, డేను డిప్యూటీ తాసిల్దార్ ఉదయ భాస్కర్ నిర్వహించారు.ఈ సందర్భంగా కాలనీ ప్రజలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. ప్రతినెల నాలుగవ శనివారం సివిల్ రైట్స్ డే నిర్వహిస్తామని, వాటి ప్రాముఖ్యత గురించిఎస్సీ కాలనీ ప్రజలకు వివరించారు. కాలనీవాసులు పలు సమస్యలు డిప్యూటీ తాసిల్దార్, దృష్టికి తీసుకువచ్చారు, కాలనీలో ఫ్లోరైడ్,ఉప్పు నీళ్లు వస్తున్నాయని,కాలనీలో త్రాగే నీరు బోరు ఉన్న పైపు లైన్ వాటికి కరెంట్ సప్లై ఇవ్వలేదని తెలిపారు, వెంటనే సమస్యను ఆర్డబ్ల్యూఎస్ ఏఈ కు చరవాణిలో తెలిపారు, కాలనీలో సిమెంట్ రోడ్డు సైడ్ కాలువ లేక మురికి నీరు బయట ప్రవహించి దుర్వాసన వస్తుందని, కొందరు వితంతువులకు పెన్షన్ రావడంలేదని కాలనీవాసులు తెలిపారు, ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఉదయ భాస్కర్, ఎస్సు హాస్టల్ వార్డెన్ ఆదినారాయణ, ఏఎస్ఐ రమనాయుడు, 14 వ వార్డ్ మెంబెర్ రామాంజనేయులు, వీఆర్‌ఓలు, ఎస్సీ కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

మాడిఫైడ్ శర్మాస్ టెక్నిక్ ద్వారా గేదె గర్భాశయ మెలిక తొలగింపు

విశాలాంధ్ర-శింగనమల: బుక్కరాయసముద్రం మండలం చెన్నంపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు రెడ్డి అనే పాడి రైతు యొక్క గేదె రాత్రి నుండి ప్రసవ వేదనతో ఈన లేక నొప్పితో కాళ్లు కొట్టుకుంటూ,పడుతూ లేస్తూ పొర్లాడుతూ ఇలా చాలా ఇబ్బంది పడింది. ఉదయం అక్కడ ఉన్న పశు వైద్య సిబ్బందిని సంప్రదించగా వారు వచ్చి పరీక్షించి శింగనమల ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ పద్మనాభంకి రెఫరల్ చేశారు. కొట్టాలపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న ఉచిత గర్భ కోశ చికిత్సా శిబిరంలో వున్న డాక్టర్ పద్మనాభం వెంటనే అక్కడికి చేరుకొని, గేదెను పరీక్షించి లోపల గర్భం మెలి తిరిగి ఉండడం వలన రాత్రంతా తీవ్ర నొప్పితో ఈనడానికి ఎంత ప్రయత్నించినా ఈన లేకపోయిందని తెలియ చేశారు. వెంటనే గేదెకు కావలసిన ఫ్లూయిడ్స్, యాంటీ బయోటిక్స్, అనాలజీ సిక్స్, యాంటిహిస్టమేన్సు ఇచ్చి మాడిఫైడ్ శర్మాస్ పద్ధతి ద్వారా, గేదెను పొర్లించి గర్భం యొక్క మెలికను తొలగించడం జరిగినది. గర్భం యొక్క మెలిక తొలగిన వెంటనే గర్భద్వారం నుండి అతి చాకచక్యంగా దూడను బయటకు తీశారు. రాత్రి నుండి తీవ్ర వేదనతో ఎంతో ఇబ్బంది పడిన గేదె, గర్భం మెలికను తొలగించి దూడను బయటకు తీసిన తరువాత కొంచెం సేపు సేద తీరి ఎంతో హుషారుగా లేచినిలబడిందని, ఈ చికిత్స నిర్వహణ క్రమంలో అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ జమ్మన్న, ప్రవీణ్, చైతన్య, లక్ష్మీనారా యణ, ఉపేంద్ర శ్రమపడి గేదె ప్రాణాలను కాపాడడంలో సంపూర్ణ సహాయ సహకారాలు అందజేశారని, డాక్టర్ తెలిపారు.

ఘనంగా ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం

సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం అందరికీ ఆదర్శప్రాయం

ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తిలో ఉత్సాహంగా పరుగు

విశాలాంధ్ర-పుట్టపర్తి: సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమని ఎస్పీ సతీష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జానకిరామయ్య పెట్రోల్ బంక్ నుంచి ఎస్పీ కార్యాలయం వరకు యూనిటీ ఆఫ్ రన్ కార్యక్రమం నిర్వహించారు. పెట్రోల్ బంక్ నుంచి నుంచి ఎస్పీ కార్యాలయం వరకు 3 కిలోమీటర్లు పరుగు ఉత్సాహంగా ఉల్లాసంగా ముందుకు సాగింది. అనంతరం ఎస్పీ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ దేశ ఐక్యత భద్రత సమగ్రతను పరిరక్షించ దానికి నన్ను నేను అంకితం చేసుకుంటానని ఎస్పీ పోలీస్ అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. దేశ స్వాతంత్ర ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన వల్లభాయి పటేల్ జమ్మూ కాశ్మీర్, హైదరాబాద్ భారత్ లో అంతర్భాగం కావడంలో ఎనలేని కృషిచేసిన ఆదర్శనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు శివాంజనేయులు, సురేష్, ఆర్ ఐలు వలి,మహేష్, రవికుమార్, డీసీఆర్బీ సిఐ శ్రీనివాసులు, ఆర్ఎస్ఐలు వీరన్న ,ప్రసాద్, ఎస్సైలు లింగన్న, కృష్ణమూర్తి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఐక్యతా ర్యాలీ

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో జాతీయ ఐక్యతా గాంధీనగర్ శ్రీ మారుతి రాఘవేంద్ర స్వామి కళ్యాణ మండపం నుంచి ప్రారంభమైన ర్యాలీ ధర్మవరం కాలేజ్ సర్కిల్ వరకు ఐక్యతా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, వ్యాపారవేత్తలు, పుర ప్రముఖులు, సామాజిక సేవకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. బిజెపి నాయకులు మాట్లాడుతూ సర్దార్ వల్లభభాయ్ దేశ స్వాతంత్ర్యం తర్వాత 562 దేశీయ సంస్థానాలను భారత సమాఖ్యలో విలీనం చేయడం ఆయన అత్యంత చారిత్రాత్మక కృషి అన్నారు. అందుకే ఆయనను దేశ ప్రజలు 'భారతదేశపు ఉక్కుమనిషి'గా గౌరవంగా పిలుస్తారు" అని పేర్కొన్నారు. కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కార్యదర్శి సంధి రెడ్డి శ్రీనివాసులు, మంత్రి నియోజకవర్గ ఇన్చార్జ్ హరీష్ బాబు, బిజెపి జిల్లా అధ్యక్షులు జిఎం శేఖర్, ప్రోగ్రామ్ ఇన్చార్జ్ అమర దేవేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి సాకే ఓబులేష్, జాతీయ కౌన్సిల్ సభ్యులు అంబటి సతీష్, పట్టణ మండలాల అధ్యక్షులు, లలిత నాట్య కళాక్షేత్రం వారు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ కేహెచ్ డిగ్రీ కళాశాల వాసవి జూనియర్ కళాశాల యాజమాన్యం వైద్య బృందం, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పటేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

విశాలాంధ్ర-ధర్మవరం: సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు అనన్యమైనవని, వారిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్నాథ్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా వారి 15వ జయంతి సందర్భంగా పటేల్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. కార్యక్రమంలో నాయకులు కురుబ నాగార్జున ,గణేష్, మల్లికార్జున, దివాకర్ నాయక్, దాదు ,హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు

గొట్లురులో ..

విశాలాంధ్ర-ధర్మవరం: కే.హెచ్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులచే గొట్లూరు గ్రామంలో ఎన్.ఎస్.ఎస్. ప్రత్యేక శిబిర కార్యక్రమములో భాగంగా 3వ రోజు సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 జయంతి పురస్కరించుకొని రాష్ట్రీయ ఏక్తా దివాస్ కార్యక్రమం నిర్వహించామని యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డా. బి. గోపాల్ నాయక్ తెలిపారు.ర్యాలీ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డా.కె. ప్రభాకర్ రెడ్డి అధ్యక్షత వహించారు. పటేల్ త్యాగాలను స్మరించుకుంటూ ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీ.జగన్నాథం అధ్యక్షత వహించారని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, కె.సునంద, సి వెంకట్రం గయ్య, ఓబులేసు, పాల్గొన్నారు.

ఉక్కుమనిషి పటేల్..

విశాలాంధ్ర - హిందూపురం : ఐక్యతా సారధి వల్లభాయ్ భారత ఏకీకరణ శిల్పి, ఇనుప మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి జాతీయ సమైక్యత దినోత్సవం భాగంగా, బాల యేసు డిగ్రీ కళాశాల ఎన్.ఎస్.ఎస్. యూనిట్ 1 ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథి పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామి రెడ్డి వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పూమాల వేసి నివాళులు అర్పించారు. ఐకమత్య భావనలను ప్రతి గుండెల్లో నిండుగా, మెండుగా నిలుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపాల్ డాక్టర్. జియావుల్లా ఖాన్ ప్రోగ్రాం అధికారి అశ్వర్థ నారాయణ విద్యార్థులచే భారత దేశ ఏకత, అభివృద్ధి, శాంతి కోసం ప్రతిజ్ఞ చేయించారు. సంజీవ రాయని పల్లెలో పాఠశాల ఆవరణంలో పటేల్‌కు నివాళులు అర్పించారు.

- కార్మిక హక్కుల సాధనలో ఏఐటీయూసీ విశేష కృషి...
- సిపిఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్

విశాలాంధ్ర-కదిరి : కార్మికుల హక్కుల సాధనలో ఏఐటీయూసీ విశేష కృషి చేసిందని ఏఐటీయూసీ గౌరవాధ్యక్షులు ఎం.వేమయ్య యాదవ్ తెలిపారు. ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని భగత్ సింగ్ ఆటో నాయకులు ఏర్పాటుచేసిన ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. అనంతరం మాట్లాడుతూ ఏఐటీయూసీ కార్మిక వర్గ హక్కుల కోసమేగాక దేశ స్వాతంత్ర్యం కోసం, కోట్లాది మంది కార్మికవర్గ గొంతుకగా వారి గుండెల్లో స్థానం సంపాదించుకుందని తెలిపారు. సామ్రాజ్యవాదులు విధించిన నూతన రాజ్యాంగ చట్టానికి బదులుగా "వయోజన ఓటింగ్" హక్కుతో ఒక "రాజ్యాంగ సభ"ను ఏర్పాటు చేయాలని మొదటి సారిగా లేవనెత్తిన ఘనత ఏఐటీయూసీకే దక్కుతుందన్నారు. అయితే కేంద్రంలో నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన అనంతరం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు కార్మిక కోడ్‌లను కొనసాగింపుగా "శ్రమ్ శక్తి ఎన్ఐటీఐ 2026" పేరుతో నూతన జాతీయ కార్మిక విధానాన్ని ముందుకు తీసుకొస్తున్నారని, దీనిని ఖచ్చితంగా కార్మిక లోకం వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి మధు నాయక్,డివిజన్ కార్యదర్శి నల్లజోడు పవన్, బీకేఎంయూ జిల్లా కార్యదర్శి బొచ్చు కదిరిప్ప, ఆదేప్ప, వ్యకాసం జిల్లా ఉప కార్యదర్శి రమణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శేషం మహేంద్ర, ఈశ్వరయ్య, శ్రీరాముల నాయుడు, అంగన్వాడీ యూనియన్ నాయకురాలు మాబున్నిసా పాల్గొన్నారు.

ప్రజా ప్రతినిధులు ప్రజలకు అండగా నిలవాలి

విశాలాంధ్ర-కదిరి : ప్రజా ప్రతినిధులు ప్రజలకు అండగా నిలవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య యాదవ్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో& మాట్లాడుతూ కూటాగుల్లల సమీపంలో ఏర్పాటు చేస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణంలో పవర్ గ్రిడ్ కరెంట్ స్తంభాల ఏర్పాటులో రైతులను గందరగోళానికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు 18కోట్లతో పది కరెంట్ పోల్లు ఏర్పాటు చేయడానికి కెసివి ఆర్ కంపెనీ దక్కించుకొని పులివెందులకు చెందిన వారికి సబ్ కాంట్రాక్టు ఇవ్వడానికి చేస్తున్న ప్రయత్నాలు మానుకోవాలని హితువు పలికారు. రైతులకు జరుగుతున్న అన్యాయంపై ఇప్పటికే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. కొందరు రైతులు కోర్ట్‌ను ఆశ్రయించారని తెలిపారు. అధికారులు రైతు పొలాలను నాశనం చేసే ఆలోచనలు సరైనది కాదన్నారు. రైతుల పక్షాన పోరాడడానికి సీపీఐ నిలబడుతుందని రైతులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు బి.నాగేశ్వరి, రామ చంద్ర, రామచంద్రరెడ్డి, గంగాదేవి ఉమాదేవి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలు .

విశాలాంధ్ర-పుట్టపర్తి: కార్మికుల హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాల రాస్తున్నాయనీ ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు పేర్కొన్నారు. శుక్రవారం ప్రశాంతి గ్రామంలో ఆటో కార్మికుల ఆధ్వర్యంలో ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయులు ముఖ్యఅతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ రంగాలను ప్రైవేట్ కార్పొరేట్ రంగాలకు అప్పజెప్పి మోడీ ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం కార్పోరేట్లను మరింత ధనవంతులు చేయడానికి కంకణం గట్టుకున్నాయన్నారు.44 చట్టాలను రద్దుచేసి నాలుగు కోడులుగా విభజించి కార్మికులకు అన్యాయం చేస్తున్నాయన్నారు. 8 గంటలు ఉన్న పని దినాన్ని 10 గంటలకు పెంచి రాత్రి సమయాల్లో కూడా ఫ్యాక్టరీల్లో మహిళలు పని చేసుకునే చట్టాన్ని తీసుకువచ్చిందని ఇది పూర్తిగా కార్మిక వ్యతిరేక చర్య అన్నారు కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ హామీ ఇచ్చి ఇంతవరకు పట్టించు కోలేదు అన్నారు. ఏఐటియుసి రాజీలేని పోరాటాలు నిర్వహిస్తా మని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు మారుతి, గోపాల్ నాయక్, రమేష్, మహబూబ్ భాష, ప్రసాద్ నాయక్, జనార్దన, నరేష్ కార్మికులు పాల్గొన్నారు.

పెనుగొండ పట్టణంలో..

లేపాక్షి పట్టణంలో..

విశాలాంధ్ర-సోమందేపల్లి: మండల కేంద్రంలోని సిపిఐ పార్టీ కార్యాలయంలో శుక్రవారం సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కోట్లాది మంది కార్మికుల వర్గ గొంతుగా ఏఐటీయూసీ రాజీలేని కార్మిక పోరాటాలు చేసి అనేక విజయాలు సాధించిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బాలస్వామి సిపిఐ మండల కార్యదర్శి జి.రాజుగోపాల్ సహాయ కార్యదర్శులు చాంద్ భాషా, అంజనమ్మ, చేనేత కార్మిక సంఘం నాయకులు షీలా నారాయణస్వామి, మండల కమిటీ నాయకులు శ్రీకాంత్, ఆంజనేయులు, బాబాజాన్, ఈడిగ నాగరాజు పాల్గొన్నారు.

హక్కులను కాలరాస్తున్నారు..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని కదిరి గేట్ చేనేత విగ్రహం దగ్గర కార్మిక హక్కుల సాధనలో ఏఐటీయూసీ విశేష కృషి చేసిందని ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం ను పురస్కరించుకుని ఏఐటీయూసీ జెండాను ఎగురవేశారు. ఏఐటీయూసీ కార్మిక సంఘం నాయకులు ఎర్రంశెట్టి రమణ అధ్యక్షత వహించారు. సందర్భంగా సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి ముసుగు మధు మాట్లాడుతూ 105 సంవత్సరాలుగా కార్మిక వర్గం అనేక పోరాటాలు, త్యాగాలు చేసి మరి కొన్ని హక్కులను సాధించుకోగలిగింది వాటి అమలులో మాత్రం ప్రభుత్వాలు ఇష్టా రాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత, 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, 4 'కార్మిక కోడ్స్'ను అమల్లోకి తెచ్చి కార్మిక వర్గాన్ని బ్రిటీష్ కాలం నాటి దుర్భర పరిస్థితికి నెట్టేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రంశెట్టి రమణ, సిపిఐ పట్టణ కార్యదర్శి పూలశెట్టి రవి కుమార్, చేనేత కార్మికసంఘం జిల్లా కార్యదర్శి వెంకట నారాయణ, గౌరవ అధ్యక్షులు వెంకటస్వామి, మీటర్ రీడర్స్ నాయకులు కిరణ్, దస్తగిరి, ప్లంబర్స్ అండ్ ఎలక్ట్రిషియన్స్, కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

హిందూపూరు పట్టణంలో..

బత్తలపల్లిలో ..

ఫారం పాండ్స్ - ప్యాక్ హౌస్ దరఖాస్తులకు నవంబర్ 5వ తేదీ చివరి గడువు

- మంత్రి సత్యకుమార్ యాదవ్

విశాలాంధ్ర-ధర్మవరం: రైతుల కోసం మరో మంచి అవకాశం - నవంబర్ 5 వరకు ఫారం పాండ్స్, ప్యాక్ హౌస్ దరఖాస్తు చేసుకోవాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం వారు మాట్లాడుతూ ప్రతి రైతు దరఖాస్తు చేసుకుని ఉద్యానవన శాఖ సబ్సిడీలతో అభివృద్ధి సాధించండి అని తెలిపారు. రైతుల ఆదాయం పెంచడం, వ్యవసాయాన్ని లాభదాయకంగా మార్చడం రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ధర్మవరం నియోజకవర్గంలోని ప్రతి రైతు తమ పరిధిలోని రైతు సేవా కేంద్రం వద్ద ఈ గడువులోగా దరఖాస్తు చేసుకోవాలి అని తెలిపారు. ఫారం పాండ్స్ రైతు పొలంలో త్రవ్వబడే చిన్న నీటి నిల్వ చెరువులు. ఇవి వర్షపు నీటిని నిల్వ చేసుకోవడంలో, ఎండాకాలంలో పంటలకు సాగునీటిని అందించడంలో, భూగర్భ జలస్థాయిని పెంచడంలో ఎంతో ఉపయోగపడతాయి అని తెలిపారు. ఈ పథకం కింద ప్రభుత్వం రైతులకు 50 నుండి 75 శాతం వరకు సబ్సిడీని అందిస్తోంది అన్నారు. పండు తోటలు, కూరగాయల పంటలు పండించే రైతులకు ఈ పథకం ఎంతో మేలు చేస్తుంది అన్నారు. అలాగే ప్యాక్ హౌస్ వ్యవసాయ ఉత్పత్తులను శుభ్రపరచడం, గ్రేడింగ్ చేయడం, ప్యాకింగ్ చేయడం, నిల్వ చేయడం వంటి కార్యక్రమాలకు అవసరమైన మౌలిక వసతులు కలిగిన కేంద్రం. దీని ద్వారా పండ్లు, కూరగాయలు నాణ్యతగా మార్కెట్లోకి చేరి మంచి ధర దక్కుతుంది అన్నారు.రైతుల ఆదాయంలో గణనీయమైన పెరుగుదల సాధించవచ్చునని, తెలిపారు. చిన్న మరియు మార్జినల్ రైతులకు ఇది మరింత అనుకూలంగా ఉంటుందని వివరించారు.

ఉక్కు మహిళ ఇందిరాగాంధీ



విశాలాంధ్ర-ధర్మవరం : భారతదేశ మొట్టమొదటి మహిళా ప్రధాని భారతదేశ ఉక్కు మహిళ స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ 41వ వర్ధంతి సందర్భంగా ధర్మవరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో తుంపర్తి పరమేష్ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ నిర్మాణం లో ఇందిరా గాంధీ చెరిగిపోని ముద్ర వేశారని ముఖ్యంగా పేదరిక నిర్మూలన, అంటరానితనం నిర్మూలన, పేదలకు ఇల్లు మరియు భూమిపంపిణీ వంటి ఎన్నో శాశ్వతమైన ప్రజా సంక్షేమ ముద్ర వేశారని కొనియాడారు.. వారి సేవలకు సార్థకంగా ధర్మవరం పట్టణంలో ఇందిరాగాంధీ గారి కాంస్యవిగ్రహం ఏర్పాటుకు అనువైన స్థలం కేటాయించాలని మున్సిపల్ కమిషనర్ కోరామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీ ఎమ్మార్పియస్ వ్యవస్థాపక అధ్యక్షులు కేశగాళ్ల వెంకటేష్, ఎన్ఎస్‌యుఐ నాయకులు సురేష్, నరేష్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆనంద్, రాజు మధు పాల్గొన్నారు

పౌరహక్కులపై అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-గుడిబండ: మండల పరిధిలోని కెఎన్ పల్లి గ్రామంలో డిప్యూటీ తహశీల్దారు కళ్యాణ్ చక్రవర్తి, ఎ.ఎస్ఐ చంద్రశేఖర్ పౌరహక్కులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మొబైల్ ఫోన్ పట్ల అవగాహన కలిగి ఉండాలని, అలాగే బాల్య వివాహాలను ప్రోత్సహించరాదని, రోడ్డు నిబంధనలు పాటించాలని, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, గ్రామంలో ఎలాంటి గొడవలు లేకుండా ప్రశాంతంగా జీవించాలని ప్రజలకు సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో విఆర్ఓలు త్యాగరాజు,రాధామణి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

రొద్దం ఎస్ఐగా వీరాంజనేయులు

విశాలాంధ్ర-రొద్దం : రొద్దం సబ్ ఇన్స్పెక్టర్‌గా కే.వీరాంజనేయులు శుక్రవారం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. రోళ్ళ నుండి బదిలీ నేపథ్యంలో ఇక్కడకు వచ్చారు.

దర్గా కమిటీ మేనేజర్‌గా మాణిక్యం బాబా

విశాలాంధ్ర-కొత్తచెరువు: హజరత్ మస్తాన్వలి సయ్యద్ స దర్గా కమిటీ మేనేజర్‌గా మాణిక్యం బాబా, ఎంపిక కావడంతో శుక్రవారం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పదవి బాధ్యతలు చేపట్టారు. అనంతరం మైనార్టీ సోదరులతో కలిసి దర్గా నుండి ఎన్టీఆర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించి ఎన్టీఆర్ విగ్రహానికి పూలహారం వేసి పాలాభిషేకం నిర్వహించారు.ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. వక్ఫ్ బోర్డ్ రాష్ట్ర చైర్మన్ అజీజ్, ఆపియా మేడం, వక్ఫుర్డ్ డైరెక్టర్లకు, తనకు ఈ పదవి రావడానికివారి కృషి మరువలేనిది అన్నారు

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు హరీష్ స్కూల్ విద్యార్థుల ఎంపిక

విశాలాంధ్ర-కదిరి టౌన్: కదిరి రూరల్ పరిధిలోని ఎరుకలవాండ్ల పల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాల విద్యార్థులు జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎంఎస్ కిరణ్, వ్యాయామ ఉపాధ్యాయులు ఖాదర్ వలీ తెలిపారు. శుక్రవారం విద్యార్థులతో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కదిరి ఎస్‌జిఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా నిర్వహించిన క్రీడా పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. షటిల్ పోటీల్లో నరసింహమూర్తి, మనోజ్ కుమార్, బాలికల విభాగంలో హృతిక, వాలీబాల్ లో నరేంద్ర యాదవ్, ఖోఖో లో మనోజ్, మోక్షిత్, 400 మీటర్ రిలే లో ప్రీతమ్ సింగ్, 400 మీటర్లు పరుగు పందెంలో నరేంద్ర యాదవ్, షాట్ పుట్ లో మోక్షిత్ నాయక్ లు ఎంపికైనట్లు వివరించారు. ఎంపికైన విద్యార్థులు రేపు (నేడు) జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొనాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా యల్లమ్మ దేవత విగ్రహ ప్రతిష్ఠాపన..

విశాలాంధ్ర-రోళ్ళ : గుడ్డుగురికి గ్రామంలో ఘనంగా శ్రీఎల్లమ్మదేవి విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. సిద్దరబెట్ట రంబాపురి ఖాసాశాఖ మఠాధ్యక్షులు శ్రీ వీరభద్ర శివాచర్య స్వామిజి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ దైవభక్తి అలవార్చుకోవాలని తెలిపారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ బి.ఎస్ గురుమూర్తి, మండల కన్వీనర్లు జీ.కే ఈరన్న సింగల్ అధ్యక్షులు దాసరెడ్డి ఏపీఐఎస్సి డైరెక్టర్ రామకృష్ణ, కుంచిటిగా ఒక్కలిగా రాష్ట్ర సాధికార కన్వీనర్ వి.యంపాండు రంగప్ప టిఎన్టియుసి పార్లమెంటు ఉపాధ్యక్షులు బ్యాడిగెరె మూర్తి, బీసీ సెల్ మండల అధ్యక్షుడు దాసప్పపాళ్యం నాగరాజు, సింగల్ విండో డైరెక్టర్ భరత్ యువ నాయకులు యోగానంద్,నాయకులు పాల్గొన్నారు

నేడు స్వామివారి కళ్యాణ మహోత్సవం

విశాలాంధ్ర-అమడగూరు : కార్తీక మాసం పురస్కరించుకొని అమడగూరు మండలంలోని తుమ్మలకొండపై శ్రీ వెంకటేశ్వర స్వామివారికి కళ్యాణ మహోత్సవం భక్తిశ్రద్ధలతో జరగనుందని ఆలయ కమిటీ చైర్మన్ శరత్ కుమార్ తెలిపారు. ఉదయం స్నపన తిరుమంజనం, పుష్పార్చన, సాయంత్రం శ్రీ పద్మావతి అమ్మవారితో కళ్యాణమహోత్సవం వైభవంగా జరుగనుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారి ఆశీర్వాదం పొందాలని కోరారు.

14 మంది నిందితులు బైండోవర్

విశాలాంధ్ర-రొళ్ల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం లో శుక్రవారం 14 మంది ఎక్సైజ్ కేసు నిందితులను ఎక్సైజ్ సీఐ మురళి కిషోర్ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల రెవిన్యూ ఇన్స్పెక్టర్ గిరియప్ప సమక్షంలో వారి ముందు బైండోవర్ చేశారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కన్నే నాయక్ కానిస్టేబుల్ మల్లికార్జున పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఆదర్శపాఠశాల విద్యార్థులు ఎంపిక

విశాలాంధ్ర-అగళి : పెనుకొండలో జరిగిన చెస్, బాడ్మింటన్ కబడ్డీ పోటీలలో జయంత్, బాడ్మింటన్ చెస్ గేమ్‌లో అండర్ 14/17 పోటీలో ఆదర్శ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనపరచి జిల్లాస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైనారు. డివిజినల్ స్థాయి పెనుకొండలో శుక్రవారం జరిగిన చెస్, బాడ్మింటన్ కబడ్డీ పోటీలలో జయంత్, బాడ్మింటన్ చెస్ గేమ్ లో అండర్ 14/17 బాలకృష్ణ, తేజస్ కబడ్డీలో హృదయచంద్ర, ప్రశాంత్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విజయకుమారి తెలిపారు. నవంబర్ 3 న ఉమ్మడి అనంతపురం జిల్లాలో జరిగే క్రీడాపోటిలలో డివిజన్ స్థాయిలో గెలుపొందిన విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్ విజయకుమారి పీడీ నారాయణస్వామి అభినందించారు.

మంత్రి సవితమ్మకి కృతజ్ఞతలు

విశాలాంధ్ర-గోరంట్ల: రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్ . సవితమ్మను శుక్రవారం పెనుగొండ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గోరంట్ల రెడ్డి సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు, గోరంట్ల పట్టణ కేంద్రంలో రెడ్డి కుల బాంధవుడు శ్రీ యోగివేమన విగ్రహ ఏర్పాటుకు స్థలం కావాలని అడిగిన వెంటనే మండల తహసిల్దార్ కార్యాలయానికి ఆనుకొని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కేటాయించాలని తహశీల్దార్ మారుతికి ఆదేశాలు ఇచ్చారు , మంత్రి ఆదేశాల మేరకు తహసీల్దార్ మారుతి వేమన విగ్రహం ఏర్పాటు కు అన్ని అనుమతులు ఇచ్చారు, దీంతో గోరంట్ల రెడ్డి సంఘం నాయకులు మంత్రి సవితమ్మ ను కలిసి కృతజ్ఞతలు తెలిపి శాలువాతో సన్మానించి, గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల రెడ్డి, రఘునాథ్‌రెడ్డి, గట్టు చంద్రశేఖర్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, మధు సుధన్ రెడ్డి,వేమా రెడ్డి, రాజారెడ్డి, వెంకట రెడ్డి, కసిరెడ్డిపల్లి రాజారెడ్డి, సంఘం నాయకులు అశ్వర్థ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి : కలెక్టర్ శ్యాంప్రసాద్

విశాలాంధ్ర-పుట్టపర్తి : ఎన్టీఆర్ భరోసా పథకం క్రింద లబ్దిదారులకు పింఛన్లు పంపిణీ చేయుటకు వస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు సంబంధించి కట్టుదిద్దమైన భద్రత ముందస్తు ఏర్పాట్లను చేసి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఎస్పీ సతీష్ కుమార్, జెసి మౌర్య భరద్వాజ్ తో కలిసి తలుపుల మండలం పెద్దన్న గారి పల్లి గ్రామంలో హెలిపాడ్ ప్రజావేదిక సభా స్థలం వద్ద మీడియా గ్యాలరీ సిట్టింగ్, త్రాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాట్లు, పార్కింగ్ ప్రదేశాల ఏర్పాట్లు, జరుగుతున్న పనులను పరిశీలించి తీసుకోవలసిన చర్లపై అధికారులకు తగు సూచనలు జారీ చేశారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రదేశాలలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేయడంతో పాటు ఉమ్మడి జిల్లా నుంచి ప్రజాప్రతినిధులు ప్రజలు వస్తున్న సందర్భంగా ఎలాంటి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్ కొరకు అనువైన ప్రదేశాలను ఏర్పాటు చేయాలని పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేపట్టాలని కలెక్టర్, ఎస్పీ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవోలు, పుట్టపర్తి సువర్ణ, కదిరి శర్మ, డి ఆర్ డి ఏ పిడి నరసయ్య, డ్వామా విజయేంద్ర ప్రసాద్, డిటిఓ సమత, డి ఎం హెచ్ ఓ ఫిరోజ్ బేగం వివిధ జిల్లాల శాఖల అధికారులు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

పిన్నదరిలో ఆలయం జీర్ణోద్ధార కుంభాభిషేకం

విశాలాంధ్ర,తాడిమర్రి : మండల పరిధిలోని పిన్నదరి గ్రామంలో- నూతనంగా నిర్మించిన శ్రీ భోగేశ్వర స్వామి దేవాలయంలో వేద పండితుల ఆధ్వర్యంలో జీర్ణోద్ధరణ కార్యక్రమాలు ఒకటో తారీఖున ప్రారంభమై 3రోజులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శనివారంగురుప్రార్థనతో మొదలై సోమవారం మహా మంగళ హారతి తో ముగుస్తాయి అని తెలిపారు. అలాగే శనివారం రాత్రి 9 గంటలకు పంచరత్నాలు ఉచిత నాటక ప్రదర్శన ఆదివారం పూజా కార్యక్రమాలు, సోమవారం ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాన్ని వేద పండితులఆధ్వర్యంలో నిర్వహించడం జరుగుతుందన్నారు సోమవారం ఉదయం 9 గంటల నుండి రాతిదూలం లాగుడు పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలుపుతున్నారు మొదటి బహుమతి 50 వేలు రెండో బహుమతి రూ.40 వేలు మూడో బహుమతి 30 వేలు నాలుగోభవతి 20 వేలు ఐదో బహుమతి రూ.10 వేలు ఆరో బహుమతి రూ.5 వేలుగా నిర్ణయించారు

మాక్ అసెంబ్లీకి ఎంపికైన వైష్ణవికి సన్మానం

విశాలాంధ్ర-నంబులపూలకుంట: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని వైష్ణవి మాక్ అసెంబ్లీకి ఎంపిక కావడంతో, శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంఈఓలు గోపాల్ నాయక్, సుబ్బిరెడ్డి అతిథులుగా హాజరై మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో చదువుకుంటూనే కృషి, పట్టుదలతో వైష్ణవి నియోజకవర్గ స్థాయి మాక్ అసెంబ్లీ పరీక్షల్లో విజయం సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు గౌరవం తీసుకొచ్చిందని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలలోనూ చురుకుగా పాల్గొని తమ ప్రతిభను నిరూపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శివయ్య, శంకర్‌రెడ్డి, రమణయ్య, వెంకట్రామిరెడ్డి, జ్యోతి, వహిదాబి, హబీబుల్లా తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శనివారం 01, నవంబర్ 2025

మెడికల్ కళాశాలల

ప్రైవేటీకరణ అడ్డుకుంటాం

విశాలాంధ్ర-గుడిబండ: గుడిబండ మండలం మోపురుగుండు గ్రామంలో మడకశిర నియోజకవర్గం వైస్సార్సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎస్ ఎల్ ఈరలక్కప్ప ఆధ్వర్యంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కోసం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కళాశాల ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మాజీ సీయం వైయస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ఉద్యమించి అడ్డుకుంటామని పేర్కొన్నారు.మెడికల్ కళాశాల ల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కోసం రచ్చబండ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సంతకాల సేకరణ చేపట్టారు.ఈ సందర్భంగా వైసిపి సమన్వయ కర్త ఈరలక్కప్ప మాట్లాడుతూ పేద వర్గాల విద్యార్థులకు వైద్య విద్య నాణ్యతగా అందాలని భావించి రూ. 8,480 కోట్ల రూపాయలతో మెడికల్ కాలేజీల నిర్మాణాన్ని గత వైయస్ఆర్ సీపీ ప్రభుత్వంలో నాటి సీఎం జగన్ మోహన్ రెడ్డి ప్రారంభించారని వివరించారు. 2023-24లో విజయనగరం, రాజమండ్రి, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల మెడికల్ కాలేజీలు ప్రారంభించి వాటిల్లో 750 ఎంబీబీఎస్ సీట్లను జగన్ మోహన్ రెడ్డి తీసుకొచ్చారని, పాడేరు, పులివెందుల మెడికల్ కాలేజీలను సిద్ధం చేశాక జాతీయ వైద్య మండలి యాభై సీట్ల చొప్పున ఇస్తామని చెప్తే ఇవ్వొద్దని లేఖ రాసి చంద్రబాబు విద్యార్థులకి అన్యాయం చేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మిగిలిన పది కాలేజీలను పీపీపీ విధానంలో ప్రైవేట్ భాగస్వామ్యానికి ఇవ్వడం దుర్మార్గమైనదని, తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనివల్ల పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకి మెడికల్ చదువులు అందని ద్రాక్షగా మారనున్నదని, ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా చంద్రబాబునాయుడు, లోకేష్ లక్ష కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ ఆస్తులను, భూములను తమ బినామీలకి కట్టబెట్టారని విమర్శలు చేశారు. జగన్ మోహన్ రెడ్డి పేదల కోసం పరితపిస్తే చంద్రబాబునాయుడు కార్పొరేట్ వర్గాలు, బినామీల కోసం పని చేస్తున్నారని ఆరోపించారు. జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు కోటి సంతకాల సేకరణ ద్వారా కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్తామని హెచ్చరించారు. మెడికల్ కాలేజీలను యధాతథంగా కొనసాగించేంత వరకు ప్రజా ఉద్యమాన్ని కొనసాగిస్తామని కూటమి ప్రభుత్వ మెడలు వంచుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాధమ్మ, పంచాయతీ అధ్యక్షుడు నాగేంద్ర, మండలపల్లి సర్పంచ్ అశ్వత్, పెట్రోల్ బంక్ తిప్పేస్వామి, రైతు విభాగం అధ్యక్షుడు కె టి మంజునాథ, ఎ ఎల్ లింగరాజు, శ్రీరామ్, శివలింగప్ప, లింగన్న, ప్రభాకర్, బంగారులింగప్ప, రవి, నరేశ్, కరినింగప్ప, వైయస్ఆర్ సీపీ నాయకులు, కార్యకర్తలు,మహిళలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకి వ్యతిరేకంగా

ప్రజాభిప్రాయ సేకరణ

విశాలాంధ్ర-కళ్యాణదుర్గం: రాష్ట్రంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2019-24 మధ్య చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై కళ్యాణదుర్గం మున్సిపాలిటీ కేంద్రంలో శుక్రవారం వైసీపీ పట్టణ కన్వీనర్ ఐ.సుధీర్, దొడగట్ట నారాయణ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. నాటి ప్రభుత్వం అమలు చేసిన వైద్య, విద్య, వ్యవసాయం, మహిళా సంక్షేమం, మౌలిక వసతులు, సంక్షేమ పథకాలపై ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తపరచాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. గ్రామస్థాయిలో ప్రజల నుంచి వచ్చిన అభిప్రాయాలను సమగ్రంగా సంకలనం చేసి గవర్నర్‌కి అందజేయనున్నట్లు తెలిపారు. "ప్రజల అభిప్రాయాలే ప్రజాస్వామ్యానికి పునాది. ప్రభుత్వ పథకాల ప్రభావాన్ని అంచనా వేయడంలో ప్రజల మాట కీలకం. ప్రతి పౌరుడి సూచన భవిష్యత్ పాలనకు దిశానిర్దేశం చేస్తుంది" అని వారు పేర్కొన్నారు. మండల కన్వీనర్ గోళ్ళ సూరి, పాపంపల్లిబాబు, తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ తలారి రాజ్ కుమార్, గోపారం శ్రీనివాసులు, షేక్షవలి, ఎర్రంపల్లి కృష్ణమూర్తి, హబీబ్, జి.రామాంజి, జాకీర్, చరణ్, శ్రీనివాసులు, నాగరాజు, బిక్కి హరి, సురేష్, అరుణ, నాగలక్ష్మి, రిజ్వానా, మమత, వంశీ, ఓంప్రకాష్, బి.రామాంజీ, మురళి, పరమేశప్ప, లక్ష్మణ్ , డీసీ పల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై రివ్యూ పిటిషన్ వేయండి

విశాలాంధ-ఉరవకొండ: ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ పాస్ కావాలన్న సుప్రీంకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్ వేయాలని, లేదా విద్య హక్కు చట్టం 2009ని సవరించాలని కోరుతూ రాష్ట్ర ఆర్థిక, వాణిజ్య పన్నుల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌కు ఉరవకొండ మండల ఏపీటీఎఫ్ శాఖ ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు. శుక్రవారం మంత్రి మండల కేంద్రం ఉరవకొండ పట్టణంలో ఇంటింటికి మంత్రి కార్యక్రమంలో పాల్గొనగా ఏపిటీఎఫ్ ప్రతినిధులు ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మండల ఏ పి టి ఎఫ్ గౌరవ అధ్యక్షులు ఆర్. లోకేష్, అధ్యక్షులు తలారి వేణుగోపాల్ , ప్రధాన కార్యదర్శి ఏళ్ళ భువనేశ్వర్ చౌదరి జిల్లా ప్రత్యేక ఆహ్వానితులు బి.నారాయణస్వామి నాయకులు బీసీ ఓబన్న, బి చంద్రశేఖర్, కే .రాముడు ఎస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సివిల్ హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం

విశాలాంధ్ర-పామిడి: సివిల్ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని పామిడి మండలంలోని నీలూరు గ్రామంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తాహసిల్దార్ షర్మిల, ఎంపీడీవో తేజోష్ణ, ఎంఈఓ జయ నాయక్, హౌసింగ్ ఏఈ మారుతి ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి పౌరుడు సమాన హక్కులు, సమాన అవకాశాలు పొందేలా భారత రాజ్యాంగం హామీ ఇస్తుంది. వివక్ష, అసమానతలు, అన్యాయాలకు సమాజంలో చోటు లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి" అని సూచించారు. అలాగే సివిల్ హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు.

ప్రజా సమస్యలపై దృష్టి సారించిన మంత్రి

విశాలాంధ్ర-పెనుకొండ: పెనుకొండలోని క్యాంపు కార్యాలయంలో, శుక్రవారం పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పలు సమస్యల పరిష్కారానికి రాష్ట్ర బీసీ సంక్షేమ చేనేత జౌళి శాఖల మంత్రి సవితమ్మ దృష్టికి వినతిపత్రాలు అందచేయగా వినతులను పరిశీలించి .వాటి పరిష్కారానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చిన మంత్రి సవితమ్మ మంత్రితోపాటుగా కూటమి నాయకులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర-ధర్మవరం: ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని వైఎస్సార్సీపీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా వారు 37వ వార్డు నందు రాష్ట్ర మున్సిపల్ ప్రధాన కార్యదర్శి చెందమూరి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో ఈ కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీరు, కూటమి ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపుమేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని, సంతకాల సేకరణ తర్వాత గవర్నర్కు అందజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో వైఎస్ఆర్సిపి నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సహస్ర దీపోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణములోని సాలే వీధిలో వెలసిన పెద్దమ్మ తల్లి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా బుగ్గ వంశస్థులు సహస్ర దీపోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వందల సంఖ్యలో మహిళలు పాల్గొని శివుని ఆకారంలో దీపాలను ప్రదర్శించారు. అమ్మవారి త్రిశూలం కూడా దీపాలతో ప్రదర్శించారు. ఈ ప్రదర్శించడం అయిన భక్తాదులను విశేషంగా ఆకట్టుకుంది. అనంతరం మహిళలు లలిత సహస్రనామ పారాయణం చేశారు. ఈ వేడుకలు చూడడానికి వందల సంఖ్యలో భక్తాదులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ వద్దే వద్దు..!

విశాలాంధ్ర-ఉరవకొండ: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం ఉరవకొండ పట్టణంలో వైసీపీ పార్టీ ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ రచ్చబండి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి, విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు ప్రణయ్ రెడ్డి ఆదేశా లతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. ప్రైవేటీకరణతో పేదలకు వైద్య విద్య అందుకుండా పోతుందని ఈ ప్రతిపాదనను ప్రభుత్వం విరమించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందన్నారు. సంతకాల సేకరణ కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి పార్టీ నాయకులు అశోక్ కుమార్, తిప్పయ్య, ఏసి ఎర్రి స్వామి, బసవరాజు, ఓబన్న, ఈడిగ ప్రసాద్, గందోడి మారేష్, కోలే గుండ్ల శేఖర్, గోవిందు, ఎర్రి స్వామి రెడ్డి, పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌరహక్కుల దినోత్సవం నిర్వహించడంలో

అధికారుల నిర్లక్ష్యమే..!

విశాలాంధ్ర-గుంతకల్లు: మండలంలో ఎస్సీ ఎస్టీలపై అధికారుల నిర్లక్ష్యం చేస్తున్నారని ఎస్సీ ఎస్టీ మేనిఫరింగ్ కమిటీ మెంబర్ హరిప్రసాద్ అన్నారు.పౌర హక్కుల దినోత్సవం ప్రతి నెల ఆఖరి తేదీన ఏదో గ్రామంలో జరగవలసినటు వంటి పౌర హక్కుల దినోత్సవంను అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారునీ అన్నారు. ఎస్సీ ఎస్టీలపై అధికారులకు ఎలాంటి చిత్తశుద్ధి లేదనిఏ ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. పౌర హక్కుల దినోత్సవం ఈరోజు జరగాల్సి ఉందని కానీ ఏ ఒక్క అధికారులు కూడా గుర్తు లేదని అన్నారు. దీన్నిబట్టి చూస్తే మండలంలో అధికారులకు ఎస్సీ ఎస్టీలపై ఎంత శ్రద్ధ ఉందో తెలుస్తుందని అన్నారు.ముఖ్యంగా ఎమ్మార్వో ఆఫీస్ పోలీస్,ఎలక్ట్రికల్ దేవాదాయ,జల వనరులు, వైద్య,విద్య మరియు ఇతర శాఖలు అధికారులు హాజరుకా కుండా అట్టడుగు వర్గాలకు ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ సోదరి, సోదరులకు న్యాయం చేసే విధంగా లేవని ఆ వైఫ్ అధికారులు ఆలోచించడం లేదని విలేకరులతో సమక్షంలో హరిప్రసాద్ యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

ఘనంగా సర్ధార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-గోరంట్ల: పట్టణం లోని శ్రీ కృష్ణ దేవరాయ జూనియర్ కళాశాల, ఎస్ పి వి ఎం డిగ్రీ కళాశాలలు సంయుక్తంగా కళాశాలల ప్రిన్సిపల్స్ విజయలక్ష్మి భక్తవత్సలంల అధ్యక్షతన ఎన్ ఎస్ ఎస్ పి ఓ లు ఆజాద్, బాల మోహన్‌ల పర్యవేక్షణ లో సర్ధార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారత స్వాతంత్ర్య సమరయోధుడు, రాజనీతిజ్ఞుడు, భారత దేశపు మొదటి ఉప ప్రధాని మరియు హెూమ్ శాఖ మంత్రిగా భారత దేశానికి ఎనలేని సేవలు అందించారు. భారత దేశాన్ని ఏకీకృతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించారు, అందువల్ల ఆయనను భారత దేశ ఉక్కుమనిషిగా పిలుస్తారు. స్వాతంత్ర్యం తర్వాత 500 పైగా సంస్థానాలను భారత దేశంలో విలీనం చేయడానికి ఆయన కృషి చేశారని వక్తలు తెలియజేశారు. అనంతరం విద్యార్థుల చేత "రాష్ట్రీయ ఏకతా దివస్" ప్రతిజ్ఞ మరియు ర్యాలీ నిరహించారు ,ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు మరియు కళాశాల అధ్యాపకులు శ్వేతా, ధనమ్మ, లక్ష్మీ, సుహాసిని, అర్షియ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ కృష్ణదేవరాయ విగ్రహ భూమి పూజ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర - అగళి : బలిజ కులస్తులు ఆరాధ్య దైవంగా కొలిచే శ్రీ కృష్ణ దేవరాయలు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని మడకశిర పట్టణంలో అమరాపురం రోడ్‌లోని శంకరప్ప బావి రోడ్ సర్కిల్ నందు శనివారం మధ్యాహ్నం 12:00 గంటలకు నిర్వహించనున్నట్లు రా వుడీ రాయల్స్ సంఘం అధ్యక్షుడు మాస్టర్ నరసింహప్ప తెలిపారు. కావున అగళి మండలంలోని బలిజ కులస్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని అన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని బలిజ నాయకులు, బలిజ కుల ప్రజా ప్రతినిధులు కుల పెద్దలు నియోజకవర్గంలోని బలిజ సోదరులు వందలాది మంది హాజరవుతున్నట్లు మాస్టర్ నరసింహప్ప తెలిపారు.

డివిజనల్ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు

విశాలాంధ్ర-పెనుకొండ: ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో శుక్రవారం జరిగిన డివిజనల్ స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 అండర్ 17 బాల బాలికల క్రీడలు జరిగాయి. ఇందులో 12 మండలాల క్రీడాకారులు పాల్గొన్నారు. ఇక్కడ ఎన్నిక ఐన క్రీడాకారులు జిల్లా స్థాయిలో పాల్గొంటారు. విజేతలు అండర్-14 బాలికల వాలీబాల్ విజేత అమరాపురం రన్నర్. పరిగి అండర్-14 బాలురు కబడ్డీ విజేత లేపాక్షి రన్నర్ చిలమత్తూరు మండలాలు విజేతలుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాఘువయ్య ప్రాధానోపాధ్యులు నాగార్జున ఎంఈఓ సుధాకర్, స్కూల్ గేమ్ ఫెడరేషన్ సెక్రటరీ లక్ష్మి నారాయణ పాల్గొన్నారని డివిజ నల్ కో ఆర్డినేటర్ నాగభూషణ్ తెలిపారు.

షిరిడి సాయిబాబా దేవాలయంలో అన్నదానం

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని శిరిడి సాయిబాబా దేవాలయంలో పట్టణ వాస్తవ్యులు బలిజ సంఘం నాయకులు కీర్తిశేషులు మిరియాల హనుమంతు వారి 16వ వర్ధంతి సందర్భంగా వారి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ అనాథ పేదలకు వృద్ధులకు ఇటువంటి అన్నదాన కార్యక్రమం నిర్వహించడం మాకెంతో సంతోషాన్ని ఇచ్చిందని తెలిపారు. ప్రతి వ్యక్తి ఏదో ఒక రూపంలో పేద ప్రజలకు వివిధ సేవలు చేయాలని తెలిపారు. అనంతరం షిరిడి సాయిబాబా సేవా సమితి వారు దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మిరియాల అంజి వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

హిందూ జాగరణ సమావేశాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని శనినారాయణ స్వామి ఆలయంలో నవంబర్ ఒకటవ తేదీ శనివారం సాయంత్రం ఐదు గంటలకు హిందూ జాగరణ సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు హిందూ భక్తులు, నిర్వాహకులు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గుడి మాన్యాలను కాపాడాలని, గుడితోపాటు ఆలయ ఆస్తులను కాపాడడానికి వ్యవస్థ తయారు చేసుకోవాలని, హిందువులకు నూతన స్మశాన వాటికను ఏర్పాటు చేయాలని, పాఠశాలల్లో హిందూ ధర్మ ప్రచారానికి అనుమతి ఇవ్వాలని, ఆలయాలను ప్రభుత్వం ఆధీనంలో నుంచి తొలగించాలని, ప్రతినెలా ఈవో జమా ఖర్చులు బహిరంగ హిందూ సమావేశంలో తెలపాలని, పూజారులకు 15వేల రూపాయలు గౌరవ వేతనం ప్రభుత్వం చెల్లించాలని వారు తెలిపారు. కావున అధిక సంఖ్యలో హిందువులు పాల్గొని సమావేశమును విజయవంతం చేయాలని తెలిపారు.

శ్రీ కృష్ణదేవరాయ విగ్రహ భూమి పూజ కార్యక్రమాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-రొళ్ల: బలిజ కులస్థులు ఆరాధ్య దైవంగా కొలిచే శ్రీ కృష్ణ దేవరాయలు విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాన్ని మడకశిర పట్టణంలో అమరాపురం రోడ్‌లోని శంకరప్ప బావి రోడ్ సర్కిల్ నందు శనివారం మధ్యాహ్నం 12:00 గంటలకు నిర్వహించనున్నట్లు యూనిట్ ఇంచార్జ్ హేమంత్ కుమార్ యూనిట్ ఇంచార్జ్ హేమంత్ కుమార్ తెలిపారు. రొళ్ల మండలంలోని బలిజ కులస్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు,మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలు ముఖ్య అతిథులుగా హాజరవుతున్నారని అన్నారు ఉమ్మడి అనంతపురం జిల్లాలోని బలిజ నాయకులు బలిజ కుల ప్రజా ప్రతినిధులు కుల పెద్దలు నియోజకవర్గంలోని బలిజ సోదరులు వందలాది మంది హాజరవుతున్నట్లు యూనిట్ ఇంచార్జ్ గొట్టుగురికి హేమంత్ కుమార్ తెలిపారు.